- మరికొన్ని గంటల్లో ఉత్కంఠకు తెర
- ఓట్ల లెక్కింపునకు అధికారుల ఏర్పాట్లు
- గెలుపు గుర్రాలపై కొనసాగుతున్న బెట్టింగ్‌లు
- మధ్యాహ్నానికల్లా ఫలితాలు వెల్లడయ్యే అవకాశం
- నారాయణపేట నుంచే తొలి రిజల్ట్
- ఒక్కో సెగ్మెంట్‌లో 14 రౌండ్ల కౌంటింగ్
- విజయావకాశాలపై గులాబీదళం ధీమా..

టిక్.. టిక్.. టిక్..

నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

మహబూబ్‌నగర్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్ డౌన్ షురూ అయ్యింది. ఆదివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆయా జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లు చేశారు. మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. నారాయణపేటలోని శ్రీ దత్త బీఈడీ కాలేజ్‌లో మక్తల్, నారాయణపేట నియోజకవర్గాలు, గద్వాలలోని పాలిటెక్నిక్ కాలేజీలో గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలు, వనపర్తి సమీపంలోని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో వనపర్తి నియోజకవర్గం, నాగర్‌కర్నూల్‌లోని నెల్లికొండి వద్ద ఉన్న అగ్రికల్చర్ కాలేజీలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాలు, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు జరుగనున్నది. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవనుండగా తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఆ తర్వాత రౌండ్ల వారీగా నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఒక్కో నియోజకవర్గంలో సుమారు 14 రౌండ్ల పాటు ఓట్లను లెక్కిస్తారు. 12 నియోజకవర్గాల్లో తొలి ఫలితం నారాయణపేట నియోజకవర్గం నుంచి వెలువడే అవకాశం ఉన్నది. ఎందుకంటే ఈ నియోజకవర్గంలో కేవలం ఏడు గురు అభ్యర్థులే బరిలో నిలిచారు. ఇక గద్వాల, కల్వకుర్తి నియోజకవర్గం ఫలితాలు ఆలస్యంగా వెలువడే అవకాశం ఉంది. ఈ రెండు నియోజకవర్గాల్లో రెండేసి ఈవీఎంలను ఉపయోగించారు. మిగతా నియోజకవర్గాల్లో నోటాతో కలిపి ఒక్కో ఈవీఎంను మాత్రమే ఓటింగ్‌కు ఉపయోగించారు. 15మంది అభ్యర్థుల ఓట్లను రౌండ్‌ల వారీగా లెక్కించాల్సి ఉంటుంది కాబట్టి ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నది. మధ్యాహ్నానికే ఎవరు గెలుస్తారనేది అంచనాకు వచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో మరోసారి సత్తా చాటుతామని గులాబీ శ్రేణులు ధీమాతో ఉన్నారు. ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాకేంద్రాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆయా జిల్లా ఎస్పీలు ప్రకటించారు. అనుమతి లేనిది ర్యాలీలు నిర్వహించరాదని పోలీస్ యంత్రాంగం సూచించింది.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. ఆయా జిల్లాల హెడ్‌క్వార్టర్లలో సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ఆయా రాజకీయ పార్టీలకు చెందిన పాస్‌లు ఉన్న కౌంటింగ్ ఏజెంటులకు అనుమతిస్తారు. ఒక్కో నియోజకవర్గంలో 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ప్రతి టేబుల్‌ను కౌంటింగ్ సూపర్వైజర్, జర్ దగ్గరుండి మానిటరింగ్ చేస్తారు. పోస్టల్ బ్యాలెట్ కోసం అదనంగా మరో టేబుల్‌ను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ ప్రక్రియను ఆయా సెగ్మెంట్ల రిటర్నింగ్ ఆఫీసర్లు, ఎన్నికల పరిశీలకులు అబ్జర్వ్ చేస్తారు. ఏజెంట్ల కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేసి ఈవీఎంలలో ఎన్ని ఓట్లు ఎవరికి పోలయ్యాయి అనే వివరాలను వారికి చూయించి రికార్డు చేస్తారు. ఆ తర్వాత 14 రౌండ్లలో లెక్కింపు పూర్తయ్యాక ఫలితాన్ని ప్రకటిస్తారు. ఆ తర్వాత రిటర్నింగ్ అధికారి ఫలితాన్ని ప్రకటిస్తారు. ఈ ఫలితాలను ఎప్పటికప్పుడు టీవీల్లో వీక్షించేందుకు, ఆన్లైన్‌లో అప్డేట్స్ తెలుసుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. కౌంటింగ్ ప్రక్రియకు కొన్ని గంటలే ఉండడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. కాగా నారాయణపేట సెగ్మెంట్లో కేవలం ఏడుగురు అభ్యర్థులు పోటీ చేస్తుండగా నోటాతో కలిపి 8. కల్వకుర్తిలో 24మంది అభ్యర్థులతోపాటు నోటాతో కలిపి 25, గద్వాలలో 20మంది అభ్యర్థులు, నోటాతో 21మందివి లెక్కించాల్సి ఉంటుంది.

గెలుపుపై ధీమాగా ఉన్న గులాబీ శ్రేణులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 12 సెగ్మెంట్లలో హోరాహోరీ పోరు నెలకొంది. ఈ ఎన్నిక ల్లోనూ 2018 ఫలితాలే వస్తాయని బీఆర్ఎస్ నాయకులు ధీమాతో ఉన్నారు. అనేక సెగ్మెంట్లలో బీఆర్ఎస్ పార్టీల కార్యకర్తలు బుకింగ్ చేసుకుని శనివారం రాత్రికి అక్కడికి చేరుకున్నారు.